క్లుప్తంగా...

కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని ఖర్గేకు వినతి


ఖర్గేను కలిసిన ఆనంద్‌రావు

చార్మినార్: త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తనకు పార్టీ టిక్కెట్ కేటాయించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి కోరినట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.ఎస్. ఆనంద్‌రావు తెలిపారు. తాను దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నానని.. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పలు కార్యక్రమాలలో పాల్గొని పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని ఆయనకు వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం నగరంలోని అంబర్‌పేట్ నియోజకవర్గంతో పాటు గోషామహల్ శాసనసభ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు చేసుకున్నానని ఆయన పేర్కొన్నా. రెండింటిలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి తనకే టిక్కెట్ కేటాయించాలని ఆయన కోరినట్లు తెలిపారు.

టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా దుర్గేశ్వర్


నియామక ప్రతిని అందుకుంటున్న దుర్గేశ్వర్

నాంపల్లి: టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా వై.దుర్గేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ నగరిగారి ప్రీతమ్ చేతుల మీదుగా ఆయన నియామకపు ఉత్తర్వుల ప్రతిని అందుకున్నారు. నూతనంగా నియమితులైన వై.దుర్గేశ్వర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎస్సీ విభాగం కన్వీనర్‌గా నియమించిన ఏఐసీసీ, టీపీసీసీ నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి


మొక్కలు నాటుతున్న గంజి రజిని తదితరులు

విజయనగర్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణకు మనమందరం పాటుపడాలని ఆసిఫ్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు గంజి రజిని అన్నారు. హరితహారంలో భాగంగా ఆదివారం ఆసిఫ్‌నగర్ హుడాకాలనీ స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ..రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ భాయ్, దాస శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీబాటతో సమస్యల సత్వర పరిష్కారం


బస్తీబాటలో పాల్గొన్న ఆశిష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: బస్తీబాట కార్యక్రమాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతున్నాయని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సంజయ్‌నగర్ బస్తీలో ఆయన బస్తీబాట నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆశిష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రతి ఇంటా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గడప గడపకూ బీఆర్ఎస్ చేరడమే పార్టీ ఉద్దేశమన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడిస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



విజయనగర్‌కాలనీ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్ఐ జి.శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 21న సాయంత్రం 6.30 గంటలకు మాసబ్‌ట్యాంక్ చింతలబస్తీ దుర్గా వైన్స్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి (37) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని 108 అంబులెన్స్ సహాయంతో వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాఖీ.. భలే గిరాకీ!


బేగంబజార్‌లో జోరుగా రాఖీల విక్రయాలు



వివిధ రకాల బొమ్మన్ రాఖీలు

- రాఖీల కొనుగోళ్లతో బేగంబజార్ కిటకిట
- జోరుగా బేగంబజార్‌లో రాఖీల విక్రయాలు
- ఉత్తర భారతీయుల సందడి

జియాగూడ: రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక, ఈ నెల 31వ తేదీన రాఖీ పండగను పురస్కరించుకుని మహిళలు పెద్ద ఎత్తున రాఖీలను గొలు చేస్తున్నారు. ఉత్తర భారతీయులు అధికంగా ఉండే బేగంబజార్, సిద్దిఅంబర్ బజార్, ఫీల్‌ఖానా, కోల్సావాడి, ఛత్రి, చుడిబజార్, జిన్సీచౌరాహి, పురానాపూల్, జియాగూడ, ధూల్‌పేట్, మంగళ్‌హాట్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున రాఖీలను కొనుగోలు చేస్తున్నారు.

◆ దీపావళి తర్వాత రాఖీ పండగను ఉత్తర భారతీయులు పెద్ద ఎత్తున్న అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించడం ఆనవాయితీ. ముఖ్యంగా రాజస్తానీలు, మార్వాడీలు, గుజరాతీయులు తర ఉత్తర ప్రాంతాల వారు పెద్ద ఎత్తున పండగను నిర్వహించుకుంటారు.

ఎంత ఖరీదైన కొనాల్సిందే..



ధూల్‌పేటలో రాఖీలు హోల్‌సేల్ విక్రయాలు జరుగుతుండగా బేగంబజార్ తదిర ప్రాంతాల్లో రిటైల్ విక్రయాలు జరుగుతున్నాయి. బేగంబజార్‌కు రాఖీలు కోల్‌కతా, గుజరాత్, రాజస్తాన్, బాంబే తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతాయి. వీటి ఖరీదు కూడా ఎక్కువే, ఫ్యాన్సీ రాఖీలు, స్టోన్‌రాఖీలు, జరిరాఖీ, వన్ గ్రామ్ గోల్డ్ రాఖీ, సిల్వర్ వివిధ రకాల డిజైన్లలో విక్రయాలకు అందుబాటులో ఉంచారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఎక్కువ డిజైన్లలో లభించే సిద్దిఅంబర్‌బజార్, బేగంబజార్, ఛత్రి, ధూల్‌పేట్ తదితర ప్రాంతాలలో రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. వీటి ధర రూ. 100 నుంచి రూ. 1200 వరకు గల వివిధ డిజైన్లలో లభ్యమవుతున్నాయి.

తెలంగాణలో అధికారం బీజేపీదే


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాంపల్లి బీజేపీ ఇన్‌చార్జి కౌశిక్‌రాయ్

గోల్కొండ: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాంపల్లి బీజేపీ ఇన్‌చార్జి కౌశిక్‌రాయ్ అన్నారు. ఆదివారం మెహదీపట్నం పుల్లారెడ్డి కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, ఈ సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారానే నిధులు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వీటికి పేర్లు మార్చి అమలు చేస్తుందన్నారు. బస్తీ దవాఖానాల నుంచి పేద ప్రజలకు ఇళ్లు ఇవ్వడం వరకు అన్ని పథకాలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుందని ఆయన అన్నారు. మైనార్టీ సంక్షేమ పథకాలకు సైతం కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటూ మైనార్టీలకు తామే పెద్దన్నగా గొప్పలు చెప్పుకుంటుందని ఆరోపించారు. దేశంలో తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాలకు బీజేపీ అధినాయకత్వం 679 మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఇన్‌చార్జిలుగా నియమించిందని, తనకు నాంపల్లి నియోజకవర్గాన్ని కేటాయించడం జరిగిందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గౌతమ్‌రావు తదితరులున్నారు.

గద్దర్ పాటలతో ప్రజాచైతన్యం


సంస్మరణ సభలో పాల్గొన్న వక్తలు

సుల్తాన్‌బజార్: కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి సంయుక్త రాష్ట్రాల ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు అఖిల భారత కన్వీనర్ బండారు లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. వక్తలుగా సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు కె.వై.రత్నం, లక్ష్మీనారాయణ, ప్రభంజన్ యాదవ్, రచయిత ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. గద్దర్ ఒక యుగకర్త అని, గద్దరు పాటలు ప్రజలను మేల్కొలిపాయన్నారు. ఆయన ఐదు దశాబ్దాల ఉద్యమ జీవితంలో ఎల్లప్పుడూ ప్రజల కోసమే జీవించారన్నారు. అగ్రకుల రాజకీయ వర్గాలతో రాజీలేకుండా నిలబడి ప్రజా పోరాటాలన్ని గానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కవులు, కళాకారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


గరుధ ధ్వజారోహణ కార్యక్రమంలో రాహుల్ దాస్ బాబా తదితరులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని ప్రసిద్ధ శ్రీహనుమాన్ బాలాజీ మందిరం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పూజల్లో భాగంగా ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, శాంతిపాటం, ద్వారతోరణ పూజ, చతుస్థానార్చనమూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్ట వయినతేయ ఆదివాసం, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరణం, మంగళాశాసనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం 10 గంటలకు లంగర్‌హౌజ్ వీర రాఘవ రామాలయం నుంచి వచ్చిన శ్రీరాహుల్‌దాస్ బాబా చేతులమీదుగా గరుడ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన ఘట్టమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం సోమవారం ఉదయం 11 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షులు గౌరిగె శ్రీనివాస్ తెలిపారు.

గుడిమల్కాపూర్‌లో అధికారులు పర్యటించాలి


డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో సమస్యలు పరిష్కరించడానికి బల్దియా, జలమండలి అధికారులు పర్యటించాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. డ్రైనేజీ పూడికల విషయంపై గత రెండు రోజుల క్రితం ఆయన జలమండలి అధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన అధికారులు డ్రైనేజీ పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు.

ఆర్యవైశ్య మహాసభ రీజనల్ చైర్మన్‌గా సత్యనారాయణ


సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేస్తున్న లక్ష్మీనారాయణ

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజనల్ చైర్మన్‌గా జె.సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ లక్డీకాపూల్‌లోని మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ ప్రాంతానికి చెందిన జె.సత్యనారాయణ 30 సంవత్సరాలకు పైగా సమాజ సేవతో పాటు ఆర్యవైశ్య సంఘాలలో పలు పదవులలో కొనసాగుతూ... వైశ్యులకు పలు సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల సంక్షేమంతో పాటు జీవితాంతం సమాజ సేవకు పాటుపడుతానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన అమరవాది లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జాబ్ మేళా

గోల్కొండ: నిరుద్యోగుల కోసం సోమవారం 96వ హైదరాబాద్ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు, డెకెన్ బ్లాస్టర్స్ ప్రతినిధి మన్నాన్‌ఖాన్ తెలిపారు. టోలిచౌకీ అల్ఫా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి పాసైన వారి నుంచి బిటెక్, బీఫార్మ, ఎంఫార్మతో పాటు ఏదైనా ఒక డిగ్రీ ఉన్న వారు విద్యార్హత ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 83743 15052 నెంబర్‌లో సంప్రదించాలి.

బీఆర్ఎస్, బీజేపీలను నమ్మరు

గోల్కొండ: రాష్ట్రంలో పాలక పార్టీ బీఆర్ఎస్‌తో పాటు బీజేపీని ప్రజలు నమ్మడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పురకుల కృష్ణ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ రింగ్‌రోడ్డు వద్ద ఆయన స్థానిక నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు దఫాలు అధికారం చలాయించిన బీఆర్ఎస్ తెలంగాణను దివాలా తీయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల నుంచి వచ్చిన సొమ్మును తన ఖాతాలలో వేసుకున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు తెలంగాణలో నిరుద్యోగ యువకులు పెరిగిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సందడిగా పర్యాటక ప్రాంతాలు


చార్మినార్-గుల్జార్‌హౌస్ రోడ్డులో సందర్శకుల రద్దీ


గోల్కొండ కోటలో పర్యాటకులు

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు జోరుగా కొనసాగాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి.

గోల్కొండ కోట కిటకిట..

గోల్కొండ: పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవు రోజును కుటుంబంతో గడపడానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు చారిత్రాక కట్టడాలను సందర్శించడానికి పోటెత్తారు. గోల్కొండ కోట ఆదివారం ఉదయం నుంచే పర్యాటక శోభను సంతరించుకుంది. వేల సంఖ్యలో పర్యాటకులు కోట సందర్శనానికి భారీ ఎత్తున తరలివచ్చారు. దీంతో కోటలోని చారిత్రక కట్టడాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా కుతుబ్‌షాహి సైనికుల పటిష్టమైన గదులు, క్లాపింగ్ క్లోటికో వద్ద ఉన్న భారీ ఫిరంగిని పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కుతుబ్‌షాహి రాజుల రాణివాసమైన రాణి మహెల్ అందాలను పర్యాటకులు తమ కెమెరాలు, ఫోన్‌లలో బంధించుకొని రాణిమహల్ గోడల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. చివరగా పర్యాటకులు కోటపై కొలువుదీరి ఉన్న శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవార్లను దర్శించుకున్నారు. మరో వైపు కుతుబ్‌షాహి రాజుల సమాదుల ప్రాంగణమైన సెవన్ టూంబ్స్‌కు కూడా పర్యాటకులు భారీ ఎత్తున తరలివచ్చారు.

కేసీఆర్ సంక్షేమ పథకాలకే ప్రజాదరణ


ఎమ్మెల్యే యాదయ్యను సత్కరించిన నేతలు

అబిడ్స్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రగతితోనే బీఆర్ఎస్ పార్టీ మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకే దక్కిందన్నారు. మరోసారి చెవెళ్ల బీఆర్ఎస్ టికెట్టును కాలే యాదయ్యకు ఇవ్వడంతో గోషామహల్ వాటర్‌బోర్డు కార్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ మెట్రో వాటర్‌బోర్డు అసోసియేషన్ అధ్యక్షులు జి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి డి.అశోక్, వైస్ చైర్మన్ శంకర్‌ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావులతో పాటు పలువురు నాయకులు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాలే యాదయ్య మాట్లాడుతూ... అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. అసోసియేట్ నాయకులు జి.సత్యనారాయణ, బి.అశోక్, దేవేందర్, ఉదయ్‌కుమార్, డి.యాదగిరి, ఎం.ప్రేమ్‌కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు గురికాకుండా వైద్యం అందించాలి


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు

సుల్తాన్‌బజార్: వైద్య రంగంలో రోజు రోజుకూ వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా వైద్యులు కూడా తమ అడుగులు వేస్తున్నారు. ఐసీయూలో అత్యవసర సమయంలో రోగి ప్రాణాలను ఎలా కాపాడాలి అనే అంశంపై హైదరాబాద్ కింగ్ కోఠి కామినేని హాస్పిటల్‌లో యువ వైద్యులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కామినేని, జెమ్ కేర్ హాస్పిటల్స్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరంలోని వివిధ ఆసుపత్రులకు చెందిన వంద మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో యువ వైద్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీయూలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఎలాంటి మెడిసిన్ ఇవ్వాలి, ఎలా చికిత్స చేయాలో వివరించారు. ఐసీయూలో వైద్యులు ఆందోళనకు గురికాకుండా సరైన వైద్యం అందిస్తే చాలా క్రిటికల్ కేసులలో రోగి ప్రాణాలను కాపాడుకోవచ్చునని సీనియర్ వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో జెమ్‌కేర్ గ్రూప్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, రవిపాటి, కామినేని డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య, కామినేని మెడికల్ కాలేజ్ హెచ్ఓడీ డాక్టర్ సాయి, డాక్టర్ రాకేష్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

దిలీప్ ఘనాటేకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న ఉమేష్‌కుమార్ జెతెన్

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మరాఠీ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దిలీప్ ఘనాటేకు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలని మరాఠా బహుసాత్ క్షత్రియ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ కుమార్ జెతెన్ కోరారు. ఆదివారం బొగ్గులకుంటలోని చెంప ఎస్టేట్స్‌లోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోషామహల్ నియోజకవర్గంలో 25 వేలకు పైగా మరాఠా సామాజిక వర్గానికి చెందిన మరాఠ ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేసిన దిలీప్ ఘనాటేకు పార్టీ టికెట్ కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. గతంలో తమ సామాజికవర్గం నుంచి గడ్డం రామస్వామి లాంటివారు రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారని గుర్తు చేశారు. మరాఠాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కేసీఆర్ ఈసారి గోషామహల్ నియోజకవర్గం టికెట్ దిలీప్ ఘనాటెకు కేటాయిస్తే మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మరాఠా బహుసాత్ క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయ్‌రాన్, ట్రెజరర్ అశ్విన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న శివకుమార్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ వినాయక నగర్‌లోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎ.శివకుమార్, సలహాదారుడు అశోక్ కుమార్‌ల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సందిరి నవీన్ కుమారాచార్యుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అలంకరణ, 8 గంటలకు మహా నివేదన, హారతి, 9 గంటలకు రాజశ్యామల యంత్ర ఆరాధన సహిత శ్రీ మహాచండీ హోం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్ణాహుతి మహా నివేదన, హారతి, శాంతి కల్యాణం నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

జియాగూడ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండు యాదవ్, కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం జియాగూడ కేశవస్వామి నగర్‌లో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గొల్కొండ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, కన్వీనర్ గోదా లక్ష్మీకాంత్ యాదవ్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ అల్వాల్ ఇంద్రసేన, నేతలు వైద్యనాథ్, ముక్కా కృష్ణాగుప్తా, రాజేందర్ డెగాన్, దర్బల్లి నర్సిములు, డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, శివకుమార్ యాదవ్, ప్రేమ్ కుమార్, డి.యాదగిరి, తులసీదాస్ పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ పథకాలతో బీజేపీకి ఆదరణ


ఆనంద్‌జైన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షమ, అభివృద్ధి పథకాలతోనే బీజేపీకి తిరుగులేని ఆధరణ లభిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆనంద్‌జైన్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆయనను గోల్కొండ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు వనమాల గోపాల్, దయానంద్ యాదవ్, శ్రీనివాస్, విజయ్, అభిషేక్, ప్రవీణ్‌లతో పాటు పలువురు బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆనంద్‌జైన్ మాట్లాడుతూ... బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే అధికారమన్నారు. అన్నివర్గాల ప్రజలు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

ముమ్మరంగా ఓటర్ల నమోదు

అబిడ్స్: ఓటర్ల నమోదు కార్యక్రమం జోరుగా చేపట్టారు. గోషామహల్ నియోజకవర్గంలోని 235 పోలింగ్ బూత్‌లలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్ల నమోదు నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పి.నరేందర్ యాదవ్ జాంబాగ్‌తో పాటు పలు ప్రాంతాల పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించి ఓటర్ల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్ లిస్టులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ ఓటర్ లిస్టులలో తమ పేరు ఉండేలా ఓటర్ లిస్టులలో తనిఖీ చేసుకోవాలన్నారు.

జియాగూడ: జియాగూడలో ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని జియాగూడ మాజీ కార్పొరేటర్, కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం 100 ఫీట్ల జాతీయ రహదారిలో బీఆర్ఎస్ నాయకులు శంభుశర్మ విశ్వకర్మ ఆధ్వర్యంలో ఉత్తర బారతీయుల ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటైంది. కార్యక్రమానికి హాజరైన మిత్రకృష్ణ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ యూత్‌నాయకుడు, అభిషేక్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


నమోదును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేత నరేందర్ యాదవ్


ఓటరు నమోదు ప్రచార పత్రాన్ని విడుదల చేసిన కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ, శంభు శర్మ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684